కుసుమం

౧

హృదయం తొమ్మిదిగంటల సుమారుకి పూనానుంచి బయలుదేరి లోనావాలాలో కొన్ని నిమిషాలు తప్ప యెక్కడా ఆగకుండా పదకొండింటి కల్లా బొంబాయిచేరే రైలుబండిపేరు 'డెక్కన్ క్వీన్'. దీనికి మొదటి రెండు తరగతులే తగిలిస్తారు కాబట్టి ప్రయాణంచేసేవాళ్లు సామాన్యంగా వున్నవాళ్లు. కాని యింటిదగ్గిరినుంచి డబ్బు తెప్పించుకొని చెయ్యివిడిచి ఖర్చుచేసే విద్యార్థులు కూడా దీంట్లో పయనిస్తారు. దీంట్లో పయనించాలని బొంబాయిలో పనిపెట్టుకుంటారు. ఆప్రాంతాన్ని చూడాలని బయలుదేరిన హరీ శంకరంకూడా దాంట్లోనే పయనిస్తోన్నాడు.

శంకరం ముందుసీట్లో వొహ పెద్దమనిషి కూచున్నాడు. ఆయనపక్కనే కేసరివర్ణంశాలువ ముసుగుపెట్టుకొని వొహరు నిద్రపోతోన్నారు. ఆ కంటి అద్దాలు, బుర్ర మీసాలు, గాంధీటోపీ మన జాతి చిహ్నాలు కాకపోయినా వొక్క చూపుతో ఆయన ఆంధ్రుడని తెలుసుకున్నాడు శంకరం. మాట్లాడిద్దామనుకున్నాడు కూడ. కాని ఆయన గంభీరత్వం చూసి వూరుకున్నాడు.

వొహగంటసేపు బండి నడవటంతోటే ఆ ముసుగులోంచి వొహామె చర్రున లేచి శంకరంమీదినుంచి దొల్లుకుంటో కిటికీనందుకొని వాంతిచేసుకుంది బైటికి. ఆ ముసలాయన ఆమెను పట్టుకున్నాడు. వాంతి అయినాక నీళ్లు అందించాడు. మెడవాలేస్తో నుంచోటాని గ్గూడా శక్తిలేని ఆమెని పట్టుకొని వెనక్కి వొరిగించి కూచోపెట్టాడు. ముఖంమీదికి వొచ్చిన వెంట్రుకల్ని వెనక్కి దిద్ది ఆమెబాధతో నాకేటిసంబంధం అన్నట్టు మళ్లీ పత్రిక తెరిచాడు. శక్తిలేక కళ్లు మూసుకుందామె. ఆమె చీరకట్టు, కళను వొలికించే ఆ ముఖం చూట్టంతోటే మనవాళ్లు మళ్లీ కనబడ్డారు కదా అని లేచికూచుంది ప్రాణం. సన్నని తీగలాంటి ఆమె దేహాకృతి, కోలముఖం, విశాలమయిన నొసలు, గులాబి మేనుఛాయ, మసక చీకటిగావున్న ఆ పెద్దపెద్దరెప్పలు, చేతకాక కొంచెంగా విడిపోయిన ఆసన్నని పెదిమలు, మోటుకాని అవయవాలు శంకరం హృదయాన్ని కొట్టుకునేట్టు చేశాయి. అంతటి కోమల విగ్రహాన్ని వూహించుకోటమే కాని అత డెప్పుడూ చూళ్లేదు. ఏ మహారాజ భవనంలోనో పుట్టి సాంజ్జమీద మెదులుకునే దాసీల మధ్య పూలల్లో బతకాల్సిన ప్రాణి ఆమె. ఇందాకటిదాక చెంపకింద చెయ్యిపెట్టుకొని పడుకోవటంచేత నాలుగువేళ్లు చెంపమీద ముద్రవేశాయి. ఇట్లాంటామెని కన్నులపండువుగా చూసి ఆనందించటానికి బహులు యేడొచ్చింది శంకరానికి. ఏమహల్లోనో పుట్టక యీ కుటుంబాల్లో యెందుకు పుట్టావమ్మా అనుకున్నాడు.

ఆ పెద్దమనిషి చదువుతో చదువుతో చప్పున జేబులోంచి వెస్టెండుగడియారం తీసి టైం చూసుకున్నాడు. పత్రిక మడతచేసి, వలసంచిలోంచి రెండు బత్తాయిపళ్లు తీసి వెండిగ్లాసుని శుభ్రంగా కడిగి దాంట్లో రసం పిండాడు. ఆమెదగ్గిరగా జరిగి, "అమ్మాయీ!"

నొసటిమీదినుంచి వెనక్కి చెయ్యిదువ్వుతో, "అమ్మాయీ!" అని కొంచెం గట్టిగా పిలిచాడు.

ఆమె సగంగా కళ్లుతెరిచింది.

"వేళయింది పళ్లరసం తాగమ్మా."

"తిప్పుతోంది, వొద్దు నాన్నా." మధురమైన సంగీతంతో అంది. ఆహారం లేకపోతే మరీ వొట్టేస్తుంది కాబట్టి తాగాలన్నాడాయన. అసహ్యపడుకుంటో కొంచెంకొంచెంగా తాగింది.

శంకరం వుండలేకపోయినాడు.

"ఏమిజబ్బండి అమ్మాయికి?"

ఆయన తల కిందికి వొంచి అద్దాలసందులోంచి శంకరాన్ని వొహ సెకెండు పాటించిచూసి,

"ఇక్కడినీళ్లు వొంటక పైత్యం."

మళ్లీ పేపరు అడ్డంపెట్టుకున్నాడు.

"ఏవూరండీ మనది?"

జేబులోంచి కార్డుతీసి యిచ్చాడు. "పద్మారావు రిటైర్డుపోలీసు ఇన్‌స్పెక్టర్" అని వుంది.

"ఏదైనా పనిమీద వెడ్తోన్నారా బొంబాయికి?"

విసుగ్గా అన్నట్టు పేపరు కిందికి వొంచి, "అవును పనిమీద" మళ్లీ చప్పున పైకి లేపాడు పేపరు. ఇంకా యెక్కువమాట్లాడిస్తే కోపగించుకుంటాడేమోనని వూరుకున్నాడు శంకరం.

చిమ్మనచీకటిగా వున్న గుహల్లోంచి పరుగెత్తోంది రైలు. దీపాలు వెలిగించారు. పగలును రాత్రితో పోల్చిచూపుతోన్నట్టుంది. వొహచోట రైలువెడ్తోన్న కొండకు కుడివేపు యెంతోలోతులో వున్న విశాల ప్రదేశం అవుపడ్తుంది. దాంట్లో అయిదారు చిన్నచిన్న పల్లెలు; వాటికి సంబంధించిన పొలాలు, అడవులు, ఆగుడిసెలున్న ప్రదేశంలోంచి మెలికలుతిరిగి పైకిలేస్తోన్న పొగలు అవుపడ్తోన్నాయి. వొహచోట దగ్గిరగా అవుపడే పొలాల్లో పనిచేస్తో చీమల్లాగా అవుపడే మనుషుల్ని చూస్తోంటే చప్పున శంకరానికి గొల్లపల్లి రమణాచార్లు యిచ్చిన చూర్ణం జ్ఞాపకంవొచ్చింది. పెద్దమనిషి యింకా పత్రికచాటునే వున్నాడు.

"నాదగ్గిర వొహచూర్ణముందండి. పైత్యానికి మంచిమందు. ఇచ్చిచూస్తారా?"

పత్రిక కిందికిదింపి విన్నాడు. శంకరంమాటలు విని ఆమె కళ్లువిప్పి అతనివేపు చూసింది. ఇద్దరివేపూ చూశాడు శంకరం. ఎవరూ మాట్లాళ్లేదు. హ్యాండుబేగులోంచి చూర్ణంసీసా తీసి పెద్దమనిషి కందించాడు. ఆయన ఆమెకిష్టమేనా అనికూడా కనుక్కోకుండానే తామరకాడలాంటి ఆమెచేతులో చూర్ణం కాస్త పెట్టాడు. ఆమె నోట్లో వేసుకొని చప్పరిచ్చింది. పులుపుకి కనుబొమలు కాస్త పైకిలేపి శంకరంవేపు చూసింది. ఆపెద్దమనిషి సీసాకు కార్కుపెట్టి శంకరానికి అందించాడు కృతజ్ఞతఅయినా చెప్పకుండా శంకరంచేసిందంతా అతనివిధి అన్నట్టు.

బండి కల్యాణ్ దాటింతరువాత పద్మారావు మళ్లీ గడియారంచూసి లేచాడు. పైనుంచి బెత్తపుపెట్టె తీసి ఇద్దరికి భోజనం సిద్ధంచేశాడు. థర్మోసునుంచి గ్లాసులో పాలువొంపి కొంచెంగా సోడాకలిపి, "కుసుమం, వేళయింది పాలుతాగు" అని గ్లాసు అందించాడు. శంకరంవేపు చూసి ముందుకి జరగమని సౌంజ్ఞ చేశాడు.

"మీరు భోంచేయండి. నే నక్కడికి వెళ్లి నాక. కానిస్తాను."

ఆయన వినిపించుకోలేదు. భోజనం ఆరంభించాడు. కుసుమం శంకరంవేపు చూసింది. ఆయెఱ్ఱని పెదిమలమీద నాలికని తిప్పుకొని, "మొహమాటపడకండి" అని నిత్రాణగా అంది.

శంకరం ముందుకి జరిగాడు.

పాలుతాగి గ్లాసు కిందపెట్టింది కుసుమం.

"ఇప్పు డెట్లావుంది కుసుమం?"

"తిప్పటం తక్కువుంది నాన్నా. కాని తలనొప్పి అట్లాగే వుంది."

"ఆకువేసుకొని కళ్లుమూసుకో నిద్రపో కాస్సేపు"

పైనుంచి ఆకులడబ్బా తీసి యిచ్చాడు. ఆమె మూడుబీడాలు మడిచి వొహటి తాను వేసుకుంది. తాంబూలం నముల్తోంటే ఆగొంతుక యెఱ్ఱబారింది.

"ఏవూరు నాన్న వీరిది?"

శంకరంవేపు చూసా డాయన.

"నాది కాకినాడండి. ఈప్రాంతం చూడాలని బైలుదేరాను. హరిశంకరం అంటారు."

పద్మారావు కుసుమంవేపు చూశాడు తెలిసిందా అన్నట్టు.

౨

స్టేషన్లో దిగినతరువాత వెల్కం హోటల్‌కి వెడ్తామన్నారు. శంకరంకూడా ప్రత్యేకస్థలం యేదీ లేదు కాబట్టి వాళ్ల వెంబడే వెళ్లాడు. వాళ్లగదిపక్కనే గది దొరికింది.

మధ్యాహ్నం కాస్త నిద్రపోదామని మంచం మీద వొరగటంతోటే తలుపుతెరుచుకొని పద్మారావు వొచ్చాడు.

"నేను కాస్సేపు బైటవెళ్లివొస్తా. అందాక నువ్వు కుసుమంగదిలో కూచో కూడదూ?"

"వెళ్లండి కూచుంటాను."

ఆలోచనగా క్షణంసేపు శంకరంవేపు చూసి తిరిగి తలుపుదాకా వెళ్లాడు. మళ్లీ వెనక్కి తిరిగిచూశాడు. శంకరంవేపు వొచ్చి ఆతనిపక్కన మంచంలో కూచున్నాడు. జేబులోంచి సిగరేటుకేసు తీసి వొకటి తాను పెదిమెల్లో యిరికించుకొని కేసు శంకరానికి అందించాడు.

"శంకరం, నీతో వొకటి చెప్పాలి." కొంచెం ఆగి,

"నీకు తెలుసా మే మిక్కడికి యెందుకు వొచ్చామో?"

"ఏదో పనుండన్నారుగా!"

"అవును, పని. కుసుమాన్ని భర్తదగ్గిర దిగపెట్టి పోవడానికి వొచ్చా. అతడు........." పళ్లు బిగించి వొచ్చేమాటని దిగమింగి, "అత డంతమంచివాడుకాదు."

శంకరం మాట్లాళ్లేదు. పూరిక్కే ఆయనముఖంలోకి చూశాడు.

"నీకు అర్థం కానట్టుంది. అవును, కాదు. కుసుమానికి మొండిపట్టుదలగా తల్లి చిన్నతనంలోనే పెళ్లిచేసింది. ఏడాదిలోనే చచ్చింది. అప్పణ్ణుంచి గారాబంగా కుసుమానికి యింటరుదాక చదువుచెప్పించా. దానిరూపంమల్లే అభిరుచులుగూడా చాలా నాజూకు. చిత్రకళ, కవిత్వం అంటే ప్రాణం. దీనిమొగుడు చదువుసంధ్యలకు స్వస్తిచెప్పి దేశదిమ్మరి అయినాడు. వెతకంగా వెతకంగా యిక్కడ గిరుగాంలో వున్నాడని తెలిసింది. ఏదో గిర్నీలో వుద్యోగ మట."

చప్పన శంకరంముందు రెండు బొమ్మలు అవుపడ్డాయి. విద్యాగంధం లేక గిర్నీలో పొట్టపోసుకుంటోన్న మోటువాడిపక్కన లలితత్వానికి గని అయి మెత్తని పరుపుల్లో మెదలాల్సిన కుసుమం మురికిచాకిరి చేస్తోంది. కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగాయి. అతని ముఖాన్ని తదేకదృష్టితో చూస్తోన్న పద్మారావు బలవంతంగా ధైర్యం తెచ్చుకొని, "ఎంతయినా కుసుమం ఆడది. రేపు నేను పడిపోతే నీతి అని గొంతెత్తి అరిచే సంఘమే దాన్ని తొక్కుతుంది. తరువాత నలిగి పోయిందని నిందిస్తుంది."

"కాని సంఘంపేరిట యెందు కిట్లా హింసించటం? ఆమెదారిని ఆమె చూసుకోని."

"లేదు, నీకు తెలీదు. పురుషుడు లేక యేస్త్రీ కూడా చెడదు. తప్పించుకో తిరిగే స్త్రీని మొగ మహారాజే వెంటబడి సామ దాన భేద దండోపాయాల్తో లొంగతీస్తాడు. మళ్లీ దుర్మార్గురాలు, నీతివిహీనురాలు అని నరకానికి తొక్కుతాడు మొగవాడే సంఘం కనుక."

చప్పనలేచి శంకరంవేపు చూడనైతేం చూడకుండా తలుపుని ఫెడేలున కొట్టుకుంటో వెళ్లిపోయినాడు పద్మారావు. వొక్కనిమిషం అట్లాగే తలుపు కేసి చూస్తో కూచున్నాడు శంకరం.

కుసుమం తలని ఆపక్కతిప్పి చూసింది. శంకరాన్ని చూసి లేవాలని ప్రయత్నించింది. అతను ముందుకువచ్చి, "లేవకండి, లేవకండి. ఆయాస పడతారు." అంటో మంచానికి దగ్గిరగా వున్న కుర్చీలో కూచున్నాడు.

"ఎట్లా వుంది తలనొప్పి యిప్పుడు?"

ఆమె మాట్లాట్టానికి నోరు తెరిచింది. కాని గొంతుతట్టుకున్నట్టు అయింది. మెత్తమీదినుంచి తల

ఎత్తి గదినాలుగువేపులా చూసింది. లేవా లని ప్రయత్నం చేసింది.

"లేవకండి, ఏంకావాలో చెప్తే నే నిస్తాను."

కుసుమం మాట్లాడకుండా లేచి కూచుంది.

"నీళ్లు కావాలా?"

లేచి గ్లాసులో నీళ్లు వొంపుకొని తెచ్చియిచ్చాడు. ఆమె కొంచెం కొంచెంగా తాగింది.

"క్షమించండి శ్రమకి."

మెల్లిగా మళ్లీ వొరిగింది. ఇంతటి అభిమానవతిని మళ్లీ ఆ మోటు మనిషిపక్కన వూహించుకున్నాడు శంకరం. పందికి పన్నీరు పోసినట్టు.

"మీ రిచ్చిన చూర్ణం చాలా బావుందండి."

"మళ్లీ రాత్రికి వోహ తడవ వాడండి."

ప్రకృతి పలువిధాలు. ఏమిటో మాయ. కొందర్ని చూసేచూట్టంతో నే యెక్కడా లేని ఆకర్షణ కలుగుతుంది. ఆకర్షింపబడటమూ పడక పోవటమూ అంటూ మనచేతుల్లో వుండదు. సూదంటు రాతికి తిరగబడటం యినుముకు చేతకాదు. శంకరం తన యీము పై యేళ్ల జీవితంలో యెన్నో దేశాలు తిరిగాడు. ఎందర్నో సుందరమైనవాళ్లని చూశాడు. కాని కుసుమాన్ని చూట్టంతోనే ఆతనిహృదయం మీద ముద్ర పడ్డది. వెయ్యేళ్ల పరిచయంలా గనిపించిం

"రెప్పవాల్చకుండా శంకరంవేపు చూసింది.

దామె. ఆతెల్లనిపరుపులో సన్నగా వొంకతిరిగి పడుకున్న ఆమెశరీరం, మెత్తదగ్గిర ముందుకుజాపిన దంతంలాంటిచెయ్యి, మెత్తమీద కుప్పగా పడివున్న నక్కతోకరంగు ఆమెజుట్టు, అన్నీ తనవే అనిపించాయి

ఆమె మళ్లీ నలువేపులా చూసింది.

"ఆకుమడిచివ్వనా ?"

కొంచెంగా నవ్వి, "కాస్త యిటు అందిస్తేచాలు ఆడబ్బా."

డబ్బా ఆమె కందిస్తో "ఏమిటి నవ్వుతారు ?"

"మొగవాళ్లకి ఆ కుమడవటం కూడా వొచ్చునా?"

శంకరం కూడా నవ్వాడు.

"అయినా నా మడవటం మొగవాళ్ల మడవటం లాగే వుంటుంది."

ఆసన్నని పొడుగాటివేళ్లతో ఆపం డుటాకుల కాడలు తీసేస్తున్నం రాస్తోంది. ఆతలగడదగ్గిర వున్న పుస్తకంమీద పడ్డది శంకరం దృష్టి. ముందుకి జరిగి దాన్ని అందుకొని ముఖపుట చూశాడు. దిగ్భ్రమ చెందాడు. కాచుపెడ్తోన్న కుసుమంవేపు చూశాడు.

"మీదే అండి యీపుస్తకం ?"

"ఏం ? నాదే చదివారామీరిది?"

శంకరం ఆబొమ్మలకేసి చూస్తోన్నాడు."

మరీ ఆశ్చర్యం వొచ్చింది శంకరంముఖంలోకి.

"దీనితరువాతిది 'రెండునీలాలు' చదివారా మీరు ?"

"చదివా. అబ్బ! అది దీనికన్నా బాసుంది. దాంట్లోని ఆరెండుగీతాలకి రెండుచిత్రాలు రాశాను రెండునెల్లు నాతెలివినంతా వుపయోగించి." ఆ ఆకుల డబ్బాకేసి యెటో చూస్తూ వొక్కొక్క మాటగా, "ఎప్పుడైనా, యీజన్మలో ఆయన్ని చూట్టం తటస్థిస్తే ఆరెండూ ఆయనకి అర్పించుకుంటాను." చప్పున శంకరంవేపు "చూడాలనివుందా ఆరెండునీలాలు ?"

"ఎక్కడున్నాయో చెప్తే తీసుకుంటాను."

మోహమూలకున్న తోలు పెట్టెవేపు కలతిప్పింది. శంకరం దాన్ని తెరిచాడు.

"అడుగున వుంది చూడండి పెద్దకవరు."

దాన్ని తీసుకొని కుర్చీలో వొచ్చి కూచున్నాడు.

"ఇట్లా యివ్వండి."

కవరుతెరిచి మంచికాగితంమీద రంగుల్తో దించిన రెండుబొమ్మలు బైటికి తీసింది. వొకటి శంకరానికి అందిస్తో "ఇది మొదటినీలం."

శంకరం దాన్ని యింకా అట్లాగే చూస్తున్నాడు.

"ఇది రెండో నీలం."

శంకరం దాన్ని అందుకొని నిర్ఘాంతపోయి చూశాడు. అయిదునిమిషాలదాకా ఆ రెండిటిపైనుంచి రెప్పమరల్ప లేదు. చప్పున ఆ రెంటినీ హృదయానికి అణచుకొని కళ్లుమూసుకున్నాడు.

"కావు. నా గీతాల్ని చదివిరాసిన చిత్రాలుకావివి. ఈదేవుళ్లని కలలో చూసి వర్ణించాలని మొండి అక్షరాల్తో ప్రయత్నించినయత్నాలు ఆరెండుగీతాలు."

కుసుమం చకితురాలై అట్లాగే చూస్తోంది.

శంకరం కళ్లుతెరిచి వుద్రేకంతో కుసుమం ముఖంలోకి చూస్తూ, "నావే యివి. హరిశంకరం నేనే."

"మీరే!"

తలవూపాడు.

వొక్కనిమిషం కుసుమం నోట్లోని తాంబూలం నమలకుండా శ్వాసఆపి రెప్పవాల్పకుండా శంకరంవేపు చూసింది. శంకరం ఆబొమ్మలకేసి చూస్తోన్నాడు. ఆ ముహూర్తాన వేరుప్రపంచమే లేదాతనికి.

"నిజంగా యీరెండునీలాలూ మీవేనా అవి?"

"........................"

ఆరెండోగీతాన్ని అందుకొని అతి మధురంగా ప్రతిశబ్దాన్ని అనుభవిస్తో పాడింది.

"ఇట్లా ఆరెండోనీలానికి మధురగానం చేసినవారే మీరు?"

పిచ్చిగా ఆమెకేసి చూస్తోన్నాడు శంకరం. ఆమె పాట ఆపిందీ, ప్రశ్నించిందీ, యేమీ వినపళ్లేదు. వొక్కనిమిషం అట్లావుండి చప్పున లేచాడు. బాధపడ్తోన్నవాడికిమల్లే రెండుచేతులు గట్టిగా వెనక్కి పట్టుకొని పెదిమలు బిగించి కిటికీదగ్గిరికెళ్లి ఎటో చూస్తూనుంచున్నాడు. కుసుమం మంచంలో మోకాళ్లచుట్టూ చేతులువేసుకో కూచొని శంకరాన్ని అమితానందంతో చూస్తోంది. ఎవరుకూడా కొన్ని నిమిషాలు మాట్లాళ్లేదు.

"మిమ్మల్ని యెప్పుడూ, పింజీలుపోసిన ధోతి, జరీఅంచు వుత్తరీయం, ముఖంమీదికి పడే క్రాపు..."

చప్పున శంకరం వెనక్కి తిరిగివొచ్చి మంచానికి దగ్గిరగా మోకాళ్లమీదకూచొని చేతులు జోడించాడు. ఆ ఆనందంతో నిండిన కళ్లల్లోంచి అతనికి తెలీకుండానే ముత్యాల్లాంటి చుక్కలు కాలువగాకాక వొక్కటొక్కటిగా దూకుతోన్నాయి.

"చాలు. ఎంత శుంఠకవికైనా తను గీతాలు రాస్తోన్నప్పుడు కలిగే ఆనందం అత్యధికం. ఆగీతాలని కవిహృదయానికి వచ్చేట్టు అర్థంచేసుకునేవాళ్లు దొరికితే వేరేదీ కోరుకోడు. నాకు నీలాంటి రసజ్ఞులు.........
.........................ఇంత ఉత్కృష్టంగా నాగీతాలకి స్థూలరూపం కలిగించేవాళ్లు......ప్రాణం

కరిగించేట్టు పాడటం......నువ్వే కవిత్వం. అబ్బ! బతకలేను. బతకలేను......తేనెతరువాత చేదు......"

లేచి పిచ్చిగా నాలుగువేపులా గభాగభా చూశాడు. కిటికీవేపు చూశాడు.

"శెలవు. ధన్యుడిని."

కిటికీవేపు పరుగెత్తాడు. కుసుమం బెదిరిపోయింది. మహాఆవేశంతో చప్పున దూకి అతనివెంట పరుగెత్తింది. రెండుకాలు కిటికీబైటికి వేసినవాడి చెయ్యిపట్టి వెనక్కి బలంకొద్దీ లాగింది. వెనక్కి పడ్డాడు శంకరం. స్పృహతప్పింది. దగ్గరగా వున్న కూజా తెచ్చి నీళ్లు నెత్తిమీద గుమ్మరించింది. నుంచోలేక గోడ నానుకుంది. అక్కడకూడా నుంచోలేక మంచంమీద వొరిగింది. పుస్తకంబొమ్మలు దిండుకింద దాచేసింది. కొంతసేపటికి తెప్పరిల్లాడు శంకరం. అప్పుడే గదిలోకి వొచ్చినట్టు కలియచూశాడు నాలుగువేపులా. కుర్చీమీది తువాలుతో తడి అద్దుకున్నాడు.

"వెళ్లి కాస్సేపు నిద్రపోండి."

"ఆచిత్రాలేవీ ?"

"................"

"భయపడొద్దు. అగాయిత్యం యేమీ చేయను."

కదల్లేదు కుసుమం.

"నిజం, అట్లా యేమీ చేయను."

మెత్తకిందినుంచి తీసియిచ్చింది. శంకరం వాటిని చూస్తూ నిద్రలోమల్లే నడచిపోతోన్నాడు. తలుపుదగ్గిరికెళ్లాడు.

"శంకరం! వొట్టు."

"ఏమీ చేయను."

3

నాలుగుగంటలకి పద్మారావు వొచ్చాడు. అతడు ముందున్న యిల్లుమార్చడంవల్ల యెంతోకష్టంమీద యిల్లుదొరికిందని చెప్పాడు. కాని తను వొక్కడు అతన్ని కలవటం బాగుండదుకాబట్టి శంకరాన్ని రావాల్సిందన్నాడు. ఇద్దరూ కలిసి సాయంత్రం యేడు గంటలకి వెళ్లారు.

రెండు పెంకుటింటి రెండోఅంతస్తుమీద రెండు గది తీసుకొనివున్నాడు పద్మారావుఅల్లుడు శోభనాద్రి. రాత్రియెనిమిదింటికిగాని రాడన్నారు. అక్కడే కనిపెట్టుకోవున్నారు. శంకరం, పద్మారావు మాట్లాళ్లేదు. ఎవరిమట్టుకు వారు ఆయాసపడ్తోన్నారు. శోభనాద్రి వుండే వాతావరణం చూసినకొద్దీ మరీ తరుక్కుపోయాయి వాళ్లహృదయాలు.

రాత్రి యెనిమిదిన్నరకు కట్టుమెట్లు గుండా తెగిపోయిన చెప్పు యీడ్చుకుంటూ వొచ్చాడు. గుండీలులేని షర్టు, ఖాకీకోటు, జుట్టంతా ముఖంమీదికి వొదిలి నెత్తివెనుకవేపు రెండుటోపీ, మురికిలాగు, పెరిగినగడ్డం, నోట్లో బీడి చూట్టంతోటే శంకరం స్తంభితుడైనాడు. తానిదివరకు మనసులో చిత్రించుకున్న దానికన్న ఘోరంగా వుంది దృశ్యం.

"శోభనాద్రి?"

"కోన్ హై ?"

"నేను పద్మారావు. హైదరాబాద."

అర్థమైంది శోభనాద్రికి. అందుకనే ఆ వేపు తిప్పుకున్నాడు ముఖం.

"ఇప్పుడెందుకొచ్చారిక్కడికి?"

"గదితాళం తియ్యి. సావకాశంగా మాట్లాడాల్సి వుంది నీతో."

విధిలేక తలుపుతెరిచాడు. దీపం వెలిగించాడు. అక్కడొకచాప వుంటే శంకరం, పద్మారావు దానిమీద కూచున్నారు. శోభనాద్రి దూరంగా గోడకి చేరబడ్డాడు.

"ఇప్పటికి తొమ్మిదేళ్లయింది నిన్ను చూడక శోభనాద్రి."

"............"

"ఇక్కడ వున్నావని కూడ మొన్న మొన్నే తెలిసింది."

"..................."

శంకరం గదంతా కలియచూశాడు. ఎడమవేపు గూట్లో వున్న పొడుగాటి నల్లని సీసాను చూసి యెప్పుడు లేచిపోతావా అక్కడినుంచి అనుకున్నాడు.

"ఏం చేస్తున్నావు యిప్పుడు?"

"గిర్నీలో."

"ఎందు కింత కష్టపడటం? నాకు తెలిపితే అన్నివిధాల సహాయపడేవాడినిగా? నువ్వుగాక వేరే యెవరున్నారని నాకు!"

కాస్త వికసించింది శోభనాద్రిముఖం.

"నీకోసం కుసుమం యెంతో బెంగపెట్టుకుంది. నువ్విక్కడ వున్నావని తెలిసినాక వొక్క ముహూర్తం హైదరాబాదంలో వుండనని పట్టు పట్టింది."

"..............."

"నువ్వు కష్టపడ్తోంటే తానెట్లాసుఖంగా వుండగలనని యేడ్వటం ఆరంభించింది. దాని యిష్టమని వెంటబెట్టుకోవచ్చా."

గుడ్లు తెరిచాడు శోభనాద్రి. "ఇదా మీయెత్తు? ఈబుజ్జగింపులు నావొద్ద సాగవు. తీసికెళ్లండి చక్కగా మీఅమ్మాయిని మళ్లీ."

జేబులోంచి బీడీ తీసి పళ్లసందున యిరికించుకొని వెలిగించాడు. గదిలోనే వొహామూలకి వుమిశాడు. శంకరంవొళ్లు మొలకలెత్తింది. ఈ గదిలో ఆతనిపక్కన మళ్లీ వూహించుకున్నాడు కుసుమాన్ని. రెండుచేతుల్లో ముఖం దాచుకున్నాడు."

"ఇంత తొందరపడకు శోభనాద్రీ. నాకు తెలుసు, డబ్బులేని స్థితిలో వుంకొహళ్ల భారం వహించటం కష్టం. కాని నాకుమాత్రం మీరుతప్ప యెవరు?"

"అవేవీ వినిపించుకోను. మీ అమ్మాయితో నాకేలాంటిసంబంధమూ లేదు."

"లేదంటే..............."

"నాకు బైటవెళ్లాల్సివుంది."

కోటు తొడుక్కొని టోపీ తగిలించాడు. తాళం చేతులోపట్టుకొని దీపం ఆర్పాడు. విధిలేక శంకరం, పద్మారావు బైటికివొచ్చారు. తాళంవేసుకొని వీళ్లకన్న ముందే మేడదిగి వెళ్లిపోయినాడు శోభనాద్రి.

దారిపొడుగువా యెవరూ మాట్లాళ్లేదు. హోటల్ మెట్లు యెక్కుతోన్నప్పుడు పద్మారావు శంకరంభుజం మీద చెయ్యివేసి అన్నాడు, "ఇట్లా వుంటాడని యిదివరకే చిత్రించి చెప్పా కుసుమానికి దాని అదృష్టం. వుదయాన కుసుమాన్ని తీసికెళ్దాం."

చప్పున ఆగాడు శంకరం. పట్టలేని వుద్రేకంతో "అంత మీకు భరువుగావుంటే గొంతు పిసకకూడదు?"

నవ్వాడు పద్మారావు. ఇదంతా నాయెక్కసం అనుకుంటోన్నావు. కుసుమం నానెత్తురు, నామాంసం కాదూ? నేను వాడితో అన్నమాటలన్నీ అక్షరాలా నిజం. వుండనని వొక్కపట్టుపట్టింది. ఇంత అనారోగ్యంగా వున్నా పూనాలోకూడ రెండురోజు లుండ లేదు. ఎంతటి పాషాణహృదయంవున్న తండ్రిఅయినా వున్న వొక్కకూతురుని, అందులో కుసుమాన్ని కన్ను దాటిపోనివ్వటానికి సామాన్యంగా వొప్పుకొంటాడా?"

శంకరం కిందిపెదిమ వొణికింది. అది పద్మారావుకూడా చూశాడు. తక్షణమే శంకరంచేతిని తన చేతులోకి లాక్కొని ముందుకి నడిపించాడు.

రాత్రంతా వొక్క-నిమిషం నిద్రపోలేదు శంకరం. ఎట్లాగైనా తరుణం కలుగచేసుకొని కుసుమంతో వొంటరిగా మాట్లాడాలని ప్రయత్నించాడు. వాళ్లగది ముందు యెన్నోసార్లు పహారాయిచ్చాడు. కాని యే ప్రయత్నమూ సాగలేదు.

తెల్లారి ఆరు ంటలకి పద్మారావు వొచ్చి పిలిచాడు. తాము సిద్ధంగా వున్నామనీ, శంకరాన్ని తొందరగా తయారుకమ్మనీ మాత్రంచెప్పి వెళ్లిపోయినాడులికాళ్లాడలేదు శంకరానికి. మిక్కిలి కావాల్సినవాళ్లని స్మశానానికి తీసుకోపోతోన్నప్పటిమల్లే అనిపించింది.

వీళ్లు వెళ్లేవరకు నిద్రలేవలేదు శోభనాద్రి. తలుపు తట్టాడు పద్మారావు.

"క్లోజ్ హై?"

మాట్లాడకుండా మళ్లీ తట్టాడు తలుపు. విసుక్కుంటూ లేచి తలుపుతీశాడు. చూశాడు. కుసుమం దివ్యసుందర విగ్రహాన్ని ఆమెవొంటిమీది వొకటిరెండు నగల్ని చూశాడు. క్రమంగా వుద్రేకం హెచ్చింది. పిడికిళ్లు బిగపట్టి మీసంమెలేస్తూ కుడికన్ను కాస్త మూసి సైగచేశాడు. కుడిచేతిని ముందుకుజాచి కుసుమాన్ని తనవేపు లాగ ప్రయత్నించాడు. పద్మారావు పళ్ళు పటపటమనిపిస్తూ చేతికర్రని ఆతనిపైకి లేపాడు. తక్షణం కుసుమం లోపలికి పరుగెత్తి శోభనాద్రి ముందు ఆతనికి వీపు ఆనించి నుంచుంది.

"ఏమిటి నాన్నా యింత అమానుష్యం?"

పద్మారావు చేతిని దింపుకున్నాడు

"వెళ్లండి. ఇహ మీరు వెళ్లండి నాన్నా."

తటాలున తలుపేసుకుంది. "ఇహ వెళ్లండి నాన్నా!"

ఇద్దరూ వొహరివెనకాల వొహరు మేడదిగారు. హోటల్ చేరారు.

౪

ఏమీతోచదు. ఏమిటో ఆవేదన. ఏదో పోగొట్టుకున్నట్టు తహతహ. ఏదీ సహించదు. ప్రతీదివిసుగు. కాఫీ పుచ్చుకునే లాంఛనం అయినాక పద్మారావు శంకరందగ్గిరకి వొచ్చాడు. ఏదో మాట్లాడాలనుకుంటారు కాని యెవ్వరూ అయిదు నిమిషాలవరకు మాట్లాడ్లేదు. చివరికి మ్యూజియం చూద్దామని బైలుదేరారు.

మ్యూజియంలో మొదటిహాల్లో వున్న విగ్రహాలని చూశారు వాతావరణంవల్ల జంతువుల వర్ణం యెట్లా పరిణమిస్తుందో చూపే ప్రదర్శనం చూశారు. పేరుబొందిన చిత్రకారుల చిత్రాలు చూశారు. ఆచిత్రాలన్నీ కవిత్వం. చిత్రం అడుగుభాగాన ఆగీతం రాసివుంది. అణిగివున్న దుఃఖమంతా వొక్కసారి పొరిలి వొచ్చింది శంకరానికి. పద్మారావు యేమీ యెరుగనట్టు యెడమమీసాన్ని పెదిమలనడుమ కొరుకుతూ బైటికి వొచ్చాడు.

శంకరం భోంచేయలేదు. గదితలుపేసుకున్నాడు. పడుకుందా మనుకున్నాడు. చదువాలని ప్రయత్నించాడు. పద్యాలు రాతామని కాగితం, కలం తెచ్చుకున్నాడు. ఇదివరకు యెన్నోసార్లు పరితాప స్థితిలో వున్నప్పుడు యెన్నో మనోహరమైన పద్యాలు పెకిలాయి. కాని యిప్పు డేమీ తోచదు. వూపిరిసెరపనీని ఆవేదన. ఏడ్చి హృదయభారం తగ్గించుకుందామనుకున్నాడుకాని యేడ్పురాదు. పిచ్చిగా గదంతా తిరిగాడు. ఎన్నోసార్లు కిందికెళ్లి రోడ్లోనుంచొని వొచ్చిపొయ్యే జనప్రవాహాన్ని చూశాడు. పద్మారావు తనగదితలుపే తెరవలేదు.

తటాలున నిశ్చయానికి వొచ్చాడు శంకరం. పరిణామం యేమైనాకాని అని తెగించాడు. గదిలోకి వొచ్చి దుస్తులు వేసుకుంటూ అద్దంముందు నుంచొని సగంవొడిసిన బ్రిలియంటైన్ సీసాని బలంకొద్ది నేలకి కొట్టాడు. "ఆముళ్లల్లోకాదు కుసుమానికి స్థలం. పవిత్ర దేవాలయంలో, నిర్మలహృదయంలో, యిక్కడ." దుర్వేవనతో తనహృదయంమీద కొట్టుకున్నాడు.

ఆమెట్లకి సమీపంలోవున్న కుళాయిదగ్గిరేవుంది కుసుమం. చెప్పులులేక వొక్కఅడుగువేసి యెరుగని పాదాలు బురదనీళ్లలో తడుస్తోన్నాయి. మసిగిన్నె నొహదాన్ని మట్టితో తోముతోంది. సగంతడిసిన చీరకంతా మన్ను అంటింది. ఆ గులాబీవన్నె మోచేతికి మసి అంటింది. ఆమెని చూసి అట్లాగే నుంచొనిపోయినాడు శంకరం.

"కుసుమం!"

ఆమె తలెత్తికూడా చూడలేదు. గిన్నెని కడుక్కొని పైకివెళ్లింది. వెనకాలే వెళ్లాడు శంకరం. గిన్నె నొహమూలకి పెట్టి బుజాల్ని జారవిడిచి మెడని వాలేస్తూ శంకరంవేపు తిరిగింది. ముఖమంతా యీడ్చుకొపోయింది. పెదిమలు యెండిపోయాయి. ఆమెలోని రక్తాన్నంతా వొక్కసారి పీల్చేసినట్టుంది.

“కుసుమం, కుసుమం, నిన్నిట్లా చూస్తే బతకలేనమ్మా. దారం తెంపినట్టు పుటుక్కున నీ గొంతెవరైనా పిసుకుతోంటే కూడా అంత కష్టమనిపించదు నాకు. ఆ ముఖం...అబ్బా! చూడలేను. ఎందుకమ్మా నీకీపిచ్చి? మీ నాన్న కఠినుడుగా అవుపడ్తాడు కాని దేవుడు. చూడు, చూడు, నిన్నింతకొండగా చూసే మీ నాన్నకి విషంపోస్తోన్నావు యీ వృద్ధాప్యంలో.”

ఆమె గోడవేపు తిరిగింది. చేతుల్లో ముఖం దాచుకుంది.

“కుసుమం, నీ దేహ మెంత సుకుమారమో నీ హృదయం కూడా అంతే లలితం. వొక్క గీతానికే కరిగిపోయే గుండె నీది. అట్లాంటి నీకు నిర్దాక్షిణ్యం తగదమ్మా. కుసుమం, యీ ముళ్లల్లో బతకవమ్మా నువ్వు!”

నిత్రాణచేత గోడకి వొరుసుతోన్నామెని తన చేతుల్లోకి తీసుకోపోయాడు. ఆమె తప్పించుకొని దూరంగా జరిగింది. కొంచెం కోపంగూడా సూచించింది.

“నువ్వు పూలల్లో బతకాల్సిన సుకుమారివి, కుసుమం. ఈ నరకంలో గాలికూడా పీల్చలేవు. కుసుమం, నీమీద యీగ వాలనీకుండా కంటిమీద రెప్పేయక కాపాడుకుంటా. పసిపిల్లకి సర్వసేవలు చేస్తూ చీమ దోమ కుట్టకుండా కాపెట్టే తల్లికిమల్లే ఆనందంలో మునిగిపోతా. నీ యీ పాదాల్లో దృష్టినిలిపి గీతాలుపాడుకుంటా. ఆరాధించుకుంటా.”

“చాలు. ఎంతటికష్టాల్లో వున్నప్పుడైనా నన్నీ ప్రపంచంలో ఇంత యెత్తుగా భావించేవాళ్లు, ప్రేమించేవాళ్లు వొకరున్నారని తలుచుకుంటే ఆ బాధలన్నీ పోతాయి. నాకంతే చాలు. నిజంగా ఆనందం అనుభవించాలంటే కష్టాల్లోనే వుండాలి, నీడహోయి యెండలోనివాళ్లకే యెక్కువగా తెలిసేటట్టు. వొకరోజు మిమ్మల్ని యీ ప్రపంచం నెత్తిన పెట్టుకుంటుంది. దేశం మారుమూలల్లో మీ పేరు ప్రతిధ్వనిస్తుంది. ఈ పాడు కొంపలో వుండి అంతటివాడు నావాడని మురుస్తాను.”

“దొంగవేషం. దొంగ మాటలు. వాడో మృగం; త్రాగుబోతు; నీతిశూన్యుడు. నువ్వు, నువ్వు, మోహినీరూపంలోని రాక్షసివి. మెత్తని దేహంలో పాషాణహృదయం కలదానివి. వాడు నిన్ను నలిపే

"కుడిచేతిని ముందుకు జూచి కుసుమాన్ని తన వేపులాగ ప్రయత్నించాడు పద్మారావు పళ్లు పటపటమనిపిస్తో చేతికర్రని ఆతనిపైకి లేపాడు ......"

స్తాడు; చంపేస్తాడు. ఇతరులకి అమ్మేస్తాడు. నానా బీభత్సం చేస్తాడు."

ఆవేశంలో ముందుమాట పెకల్లేదు. వొళ్లంతా చెమటలు కమ్మాయి. ముఖం జాజువారింది. రెప్ప వాల్పకుండా కుసుమం వేపు చూస్తోన్నాడు. కుసుమం తలవొంచుకుంది. పైట అద్దుకుంది కళ్లకి.

"కుసుమం, కుసుమం క్షమించమ్మా! మూర్ఖుణ్ణమ్మా నేను. ఆవేశంలో నీ హృదయానికి ముల్లు నాటాను.

ఆమె అట్లాగే మాట్లాడకుండా నుంచుంది. కళ్లు అద్దుకుంటుంది.

"నీ యీ త్యాగంవల్ల అతను మనిషి అవుతాడనా?"

"నాకు ఫలితంతో అవసరం లేదు. నాది నిష్కామకర్మ."

"ఎట్లా అవుపడ్తోన్నావు కుసుమం, నాకీవాళ్ల!"

"ఇహ యెక్కువ బాధ పెట్టక వెళ్లిపోండి. నాకూ గుండెవుంది. కాని నాతోవను నన్ను పోనీ."

శంకరం ఆమెముందర మోకాళ్లమీద వాలబడి ఆమెచేతులు పట్టుకోపోయాడు. ఆమె పక్కకి జరిగింది. అట్లాగే కూచున్నాడు ఆమెవేపు చూస్తో. లేచి వెళ్లుతాడేమోనని యెదిరిచూసింది. చప్పున బైటికి వెళ్లిపోయింది.

పదినిమిషాలు గడిచాయి, పదిహేను గడిచాయి. మెల్లిగా లేచాడు శంకరం. మెట్లదగ్గిర కొళాయిదగ్గిర

కూడా అవుపళ్లేదు కుసుమం. వీథిలో తలవొంచుకొని బైలుదేరాడు.

"శంకరం !"

పైకి చూశాడు. నోటికి పైట ముద్దగా అడ్డం పెట్టుకొని వాడిపోయినకళ్లతో ముందుకి వొంగి చూస్తోంది కుసుమం.

"ఆ రెండు బొమ్మలూ ఆ పెట్టెలోనే వున్నాయి. తీసికెళ్లు. నాజ్ఞాపకం."

తలవొంచుకున్నాడు శంకరం. రెండడుగులు ముందుకి నడిచాడు.

"శంకరం !"

తిరిగీ చూశాడు పైకి.

"మళ్లీ రాకు !"

తలవొంచుకొని గబాగబా నడిచిపోయాడు.

ఆంధ్రుడు తుదకు మేల్కొనెను